RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 284 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 20-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 284 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 20-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

# అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం**

**ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ**

**కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం**

**సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం**


**భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు,

తరువాయి 2లో..





## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

### అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్

**ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుపై నిబంధనలను సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు**

**భూమి నిబంధన 50 నుంచి 10 ఎకరాలకు తగ్గింపు**

**రాష్ట్రంలో 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు ఆమోదం**

**60 రోజుల్లోనే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో వర్సిటీలకు అనుమతులు**


**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్

తరువాయి 2లో..

## కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..

### ఆత్మకథపై సోనియా గాంధీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ .. తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు. సోనియా అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు

తరువాయి 2లో..




# 80% పట్టు కోల్పోయి..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హార్మూజ్ జలసంధి.. పశ్చిమాసియా యుద్ధానికి ఇప్పుడు మరింత ఆజ్యం పోస్తోన్న అంశం ఇది. ఈ జలమార్గంపై నియంత్రణ తమకే ఉందంటూ ఇరాన్, అమెరికా గత కొన్ని రోజులుగా వాదోపవాదాలు చేసుకుంటూనే ఉన్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఒక అడుగు ముందుకేసి.. 'హార్మూజ్ (ఫ్రీడమ్ శీట ఎశీతీఎబట) ఇక మా భూభాగమే' అని ప్రకటించుకున్నారు. దీన్ని ఇరాన్ ఖండిస్తున్నప్పటికీ.. తాజా పరిణామాలు చూస్తుంటే ఈ కీలక జలసంధి టెహ్రాన్ చేయి దాటిపోతున్నట్లే కన్పిస్తోంది. హార్మూజ్‌పై ఇరాన్ 80శాతం పట్టు కోల్పోయినట్లేనని అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. హార్మూజ్ జలసంధిలో ఇప్పుడు రెండు మార్గాల్లో నౌకల రాకపోకలు సాగుతున్నాయి. ఒకటి ఇరాన్ సూచించిన మార్గం కాగా.. రెండోది ఒమన్ ఉత్తర తీరం మీదుగా వెళ్లే షిప్పింగ్ ఛానెల్. ఇది అమెరికా సూచించిన ఐరాస అధీకృత రవాణా మార్గం. అయితే,

తరువాయి 2లో..

## ఆరోగ్య బీమా పెంపు.. ఎమ్మెల్యేలకు ప్రభుత్వ కార్లు సీఎం విజయ్




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు ప్రజలకు సీఎం విజయ్ శుభవార్త చెప్పారు. ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం కింద కుటుంబాలకు ఏటా అందించే బీమాను రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. ఆదాయం, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థ ఆవిన్ సేకరించే పాల ధరనూ పెంచారు. లీటరుకు

తరువాయి 2లో..

## ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్

**గూడూరు జంక్షన్ కష్టాలకు చెల్లుచీటి**

**గూడూరు-గుమ్మిడిపూండి మధ్య 3, 4వ రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**రూ. 2,229 కోట్ల అంచనా వ్యయంతో 90 కిలోమీటర్ల మేర నిర్మాణం**

**గూడూరు జంక్షన్‌లో రద్దీ తగ్గి, మరిన్ని రైళ్లకు అవకాశం**




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం చేకూర్చే కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గూడూరు-గుమ్మిడిపూండి మధ్య 90 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,229 కోట్లుగా నిర్ణయించారు. కేంద్ర

తరువాయి 2లో..

# అసలేంటి సెక్షన్ 22ఏ?

## పొరపాటు ఎలా జరిగింది?

**తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిక**

**రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు నిలిచిపోవడంతో యజమానుల ఆందోళన**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే

తరువాయి 2లో..



## అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

లఅంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# డిప్యూటీ చైర్మన్... హుందాగా టీడీపీ...

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవి కీలకమైనదిగానే చూడాలి. ఎందుకంటే ఇది పెద్దల సభ. అంతే కాదు చైర్మన్ డిప్యూటీ చైర్మన్లకు ప్రోటోకాల్ ఉంటుంది. అలాగే చైర్మన్‌తో సమానంగా డిప్యూటీ చైర్మన్‌కు తగిన గౌరవ మర్యాదలు లభిస్తాయి. రాష్ట్రంలోని మేధావులు, వివిధ రంగాల నిపుణులు సభ్యులుగా ఉండే ఈ సభలో సంయమనం, హుందాతనం కాపాడడంలో డిప్యూటీ చైర్మన్ బాధ్యత ఎంతో ఉంటుంది. ఇంతటి కీలకమైన పదవి కష్టకాలంలో వైసీపీ పరం అయింది. నిజానికి సంఖ్యా బలం రీత్యా వైసీపీదే మండలిలో పైచేయి. మొత్తం 58 మంది సభ్యులు కలిగిన సభలో 30 మందికి పైగా సభ్యులు వైసీపీకి ఉన్నారు. ఆ విధంగా మెజారిటీ ఆ పార్టీకి ఉంది. దాంతో డిప్యూటీ చైర్మన్ ఆ పార్టీకే దక్కింది. సరిగ్గా ఇక్కడే టీడీపీ కూటమి హుందాతనం గురించి చెప్పుకోవాలని అంటున్నారు. టీడీపీ కూటమి తలచుకుంటే పోటీకి దిగవచ్చు. ఆ తరువాత ఎన్నిక జరిగితే రసకందాయంలో అంతా సాగుతుంది. అదే సమయంలో వైసీపీలో ఉన్న ఎమ్మెల్సీలను కూడా తమ వైపు ఆకట్టుకుని ఎలాగైనా వ్యూహాలతో టీడీపీ తమ విజయాన్ని నమోదు చేయవచ్చు అని అంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీ, పైగా శాసన సభ అంతా పరచుకున్న పార్టీ తలచుకుంటే ఏమైనా చేయవచ్చు. కానీ ఇక్కడే కూటమి పెద్దన్న టీడీపీ హుందాతనాన్ని పాటించింది అని అంటున్నారు. దాంతో వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఎన్నిక ఏకగ్రీవం అయింది అని గుర్తు చేస్తున్నారు. ఇక వైసీపీ కూడా వ్యూహాత్మకంగా వ్యవహరించింది అని అంటున్నారు. తమ ఎమ్మెల్సీలలో పలువురు ఈ పదవిని ఆశిస్తున్నా కూడా సమర్ధుడు బలమైన సామాజిక వర్గానికి చెందిన మాధవరావుని ఎంపిక చేసింది. తూమాటి మాధవరావు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన ప్రకాశం జిల్లాకు చెందిన వారు. వైసీపీలో ఆయన చురుకుగా వ్యవహరిస్తున్నారు. అంతే కాదు మండలిలో ఆయన పెద్ద గొంతుకగా ఉంటూ పార్టీ తరఫున గట్టిగా మాట్లాడుతున్నారు. దాంతో ఆయన చిత్తశుద్ధికి అంకితభావానికి వైసీపీ పెద్ద పీట వేసింది అని అంటున్నారు. నిత్యం ఏపీ రాజకీయాల్లో టీడీపీ వర్సెస్ వైసీపీ ఢీ అంటే ఢీ కొడుతూ ఉంటాయి. అదే విధంగా రాజకీయ వేడి కూడా ఘాటుగానే ఉంటుంది. అలాంటి చోట ఇంత సామరస్యంగా హుందాగా ఒక కీలకమైన పదవికి ఎన్నిక ముగియడం అంటే మంచి సంప్రదాయానికి ప్రాధాన్యత ఇచ్చారు అని అనుకోవాల్సిందే. ఇదే తీరున ఆవేశ కావేశాలను తగ్గించి అధికార విపక్షాలు కలసికట్టుగా ఉంటే రాష్ట్ర సమస్యలకు తగిన విధంగా పరిష్కారం దక్కుతుందని అంటున్నారు. రాజకీయాలు హుందగా ఉంటేనే జనాలు కూడా ఆనందిస్తారు అని కూడా ప్రజాస్వమ్య ప్రియులు మేధావులు అంటున్నారు. ఇదిలా ఉంటే తనను అంతా కలసి ఏకగ్రీవంగా డిప్యూటీ చైర్మన్ గా ఎన్నుకున్నందుకు తూమాటి మాధవరావు సభలోనే ధన్యవాదాలు చెప్పారు. ఇక ఆయన నాయకత్వంలో సభను చక్కగా నడుపుతారని అంతా ఆశిస్తున్నారు.

### గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

# అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు. వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా, మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు. గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

## అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్

డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.

# ఇరాన్ చేయిదాటుతోన్న హర్మూజ్..

హర్మూజ్ తమ నియంత్రణలోనే ఉందని చెబుతోన్న ఇరాన్.. ఒమన్ రూట్‌లో వెళ్తోన్న నౌకలపై పదే పదే దాడులు చేస్తోంది. అయినప్పటికీ.. చాలా నౌకలు ఇదే మార్గాన్ని ఎంచుకోవడం గమనార్హం. గత రెండు వారాలుగా ఒమన్ మార్గంలోనే 80శాతానికి పైగా నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లెర్ డేటా చెబుతోంది. ఇరాన్ దాడులు కొనసాగుతున్నప్పటికీ.. అమెరికా నౌకాదళాలు కల్పిస్తోన్న భద్రతతో ఈ నౌకలు ఒమన్ తీరం నుంచి ప్రయాణిస్తున్నాయని సదరు డేటా పేర్కొంది. దీన్ని బట్టి చూస్తుంటే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ కోల్పోతున్నట్లు స్పష్టమవుతోందని కెప్లెర్ క్రూడాయిల్ అనాలిసిస్ హెడ్ హోమాయూన్ అభిప్రాయపడ్డారు. నెల క్రితం వరకు ఒమన్ మార్గంలో ఎలాంటి నౌకల ట్రాఫిక్‌ను కెప్లెర్ గుర్తించలేదు. కానీ, రెండు వారాల నుంచి ఈ రూట్‌లో రాకపోకలు గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ దేశాలు హర్మూజ్ మీదుగా పర్షియన్ గల్ఫ్‌ను దాటడానికి అతిపెద్ద క్రూడాయిల్ ట్యాంకర్లను వినియోగిస్తున్నాయి. తర్వాత గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని డేంజర్ జోన్ వెలుపలకు చేరుకున్నాక.. కస్టమర్ ట్యాంకర్లలో చమురును నింపుతున్నాయి. అయితే, హర్మూజ్‌ను దాటే క్రమంలో ఇరాన్ దాడుల నుంచి తప్పించుకునేందుకు కొన్ని వారాల పాటు ఇవి తమ ట్రాన్స్‌పాండర్లను ఆఫ్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ జలసంధి నుంచి ప్రయాణిస్తోన్న అన్ని నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. తాము సూచించిన మార్గంలో ప్రయాణించే నౌకలకు రక్షణ కల్పిస్తున్నామని, తద్వారా చమురు రవాణా నిరాటంకంగా సాగేందుకు కృషి చేస్తున్నామని అగ్రరాజ్యం చెబుతోంది. ఇటీవల అమెరికా ఇంధన మంత్రి క్రిస్ రైట్ మాట్లాడుతూ.. హర్మూజ్ మీదుగా గతవారం రోజుకు సగటున 15 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా జరిగినట్లు పేర్కొన్నారు. యుద్ధం ముందు నాటి పరిస్థితికి (సగటున రోజుకు 20 మిలియన్ బ్యారెళ్లు) చేరుకుంటున్నామని తెలిపారు. అందువల్లే 'హర్మూజ్ మా భూభాగమే' అని ట్రంప్ ప్రకటించుకున్నారు.

**ఆర్థికంగానూ ఇరాన్‌కు దెబ్బే..**

వాస్తవానికి అమెరికాతో చర్చిస్తోన్న అవగాహన ఒప్పందం ప్రకారం.. హర్మూజ్‌లో ప్రయాణించే నౌకల నుంచి టోల్ వసూలు చేసేందుకు ఇరాన్‌కు అవకాశం లభించనుంది. దీన్ని గల్ఫ్ దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా సూచించిన ఒమన్ మార్గాన్ని నౌకలు ఎంచుకోవడానికి ఈ టోల్ కూడా ఓ కారణమనే చెప్పొచ్చు. ఇప్పుడు హర్మూజ్‌పై ఆధిపత్యం తగ్గితే టెహ్రాన్‌కు ఆర్థికంగానూ గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. మరోవైపు, ఈ జలసంధిపై పట్టు పెంచుకునేందుకు ఇరాన్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. నౌకల రాకపోకల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికపై ఒమన్‌తో ఒప్పందం కుదిరిందని టెహ్రాన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే, హర్మూజ్ విషయంలో జోక్యం చేసుకుంటే.. ఒమన్‌పై బాంబులేస్తామని అమెరికా బెదిరించడంతో ఈ ఒప్పందం అమలుపై సందిగ్ధత నెలకొంది.

# అసలేంటి సెక్షన్ 22ఏ?

దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?**

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్‌ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి.

**ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు..:** ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్ (1800-599-4788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

**ప్రతిపక్షాల విమర్శలు..:** ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## మొదటి పేజీ తరువాయి

# కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..

రాజకీయాలవైపు లాగాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం, తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను రాబట్టడం అంత సులువుగా జరగలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

# అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు

ముందడుగు వేసింది. 'జూక్-3' (ఝ్రబనబవ-3) రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న 'లాంగ్ మార్చ్-10బీ' రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూ ఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్(రాజూఝఎవశ), బ్లూ ఆరిజిన్ (దీశ్రీబవ ాతీఱస్త్రఱఅ) సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వినియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

# ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం డబుల్ లైన్‌గా ఉన్న ఈ మార్గాన్ని నాలుగు లైన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, మరిన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపేందుకు వీలవుతుందని వివరించారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కతా, ఢిల్లీ-చెన్నై మార్గాలతో పాటు వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ అదనపు ట్రాక్‌లు ప్రాంతీయ అభివృద్ధికి, ప్రగతికి బాటలు వేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొంటూ కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు రైల్వే మంత్రికి ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రాజెక్టుతో చేకూరే ప్రయోజనాలు**

ఈ ప్రాజెక్టు పూర్తయితే గూడూరు జంక్షన్‌లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. చెన్నై, విజయవాడ, తిరుపతి వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు సులభతరం అవుతాయి. ముఖ్యంగా పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్, కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ వంటి కీలక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడుతుంది. ప్రాజెక్టులో భాగంగా స్వర్ణముఖి నదిపై 360 మీటర్ల మెగా బ్రిడ్జితో సహా 21 ప్రధాన వంతెనలు, 127 చిన్న వంతెనలు నిర్మించనున్నారు. సుమారు నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల ఏటా అదనంగా 21 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు, దాదాపు 61 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, మల్టీమోడల్ కనెక్టివిటీని మెరుగుపరచనుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం రూ.9,450 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే దేశంలోని తూర్పు, దక్షిణ కారిడార్లలో సరుకు, ప్రయాణికుల రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది.


# “మీ గళం – మా బలం”

## విశాఖ తూర్పు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రియాంక దండి నయా అడుగు!



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 19:**
విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నడుం బిగించింది. నియోజకవర్గంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, స్థానిక నాయకులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని, పరిష్కారం చూపకుండా ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు ఇన్‌ఛార్జ్ ప్రియాంక దండి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తొలగించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఒక సరికొత్త మార్గాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ గోడును నేరుగా పార్టీ దృష్టికి తీసుకురావచ్చని ఆమె స్పష్టం చేశారు. స్థానికులు తమ సమస్యలను 6305821260 అనే వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ రూపంలో గానీ, ప్రియాంకదండిఆఫీస్ ఏజిమెయిల్ .కాం ఈమెయిల్‌కు గానీ పంపించి ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా, ఫోన్ ద్వారా సంప్రదించి పార్టీ కార్యాలయానికి స్వయంగా వచ్చి కూడా తమ ఇబ్బందులను వివరించవచ్చని, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటూ తక్షణమే చర్యలు తీసుకుంటుందని ప్రియాంక దండి భరోసా ఇచ్చారు.


# విశాఖ వేదికగా 22, 23 తేదీల్లో బ్రిక్స్ మంత్రుల సదస్సు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 19:**
అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 2వ బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాలకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. భారతదేశం 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనాతో సహా మొత్తం 11 బ్రిక్స్ దేశాల నుంచి మంత్రులు, ఉన్నతస్థాయి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ‘బిల్డింగ్ ఫర్ రెసిలెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ’ అనే ప్రధాన అంశంతో జరగనున్న ఈ చర్చల్లో యువజన సాధికారత, నైపుణ్యాభివృద్ధి, క్రీడా సాంకేతికత, సంప్రదాయ క్రీడల పరిరక్షణ వంటి కీలక అంశాలపై సభ్య దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. సదస్సులో భాగంగా 22వ తేదీన తోట్లకొండలో మొక్కలు నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన అనంతరం రాడిసన్ బ్లూ హోటల్‌లో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి నోవాటెల్ హోటల్‌లో ఏపీ సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసే గాలా డిన్నర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర క్రీడల మంత్రి పాల్గొంటారు. 23వ తేదీ ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులో 5 కిలోమీటర్ల మేర ‘బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ’, అనంతరం క్రీడా మంత్రుల సమావేశం, నగరంలోని క్రీడా ప్రాంగణాల సందర్శన ఉంటాయి. అంతర్జాతీయ ప్రతినిధుల రాక దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు భద్రత, ప్రోటోకాల్, వసతి, వైద్య సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు వ్యవహరిస్తున్నారు.

# వికసిత్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ...!!

**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగష్టు 19**
భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులు సంఘం ఆధ్వర్యంలో “వికసిత్ భారత్” పోస్టర్ విశాఖ పార్లమెంట్ సభ్యులు భరత్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వలన యువత దారి తప్పుతున్నారని వాటి వలన కలిగే దుష్ప్రభావాలు మీద అవగాహన కలిగిస్తూ, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు సంఘం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి సారధ్యంలో జోనల్ కార్యదర్శి చిరంజీవి, జోనల్ అడ్వైజర్ కోన ప్రకాశ్, జోనల్ కోశాధికారి పచ్చిపులుసు కనకరావు, విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వర రావు,ఆనంద పురం మండలం సెక్రటరీ నాగేశ్వరరావు, మధుర వాడ అద్యక్షులు కిరణ్, విజయనగరం మహిళ అద్యక్షురాలు భవాని, సభ్యులు విజయలక్ష్మీ, రాణి, తెలుగు దేశం పార్టీ మహిళ నాయకులు ఈతలపాక. సుజాత, వానపల్లి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ లో “న్యూస్ ఇన్ ఫ్రేమ్స్ ” ఫోటో ఎగ్జిబిషన్

**అద్భుతమైన ఛాయాచిత్రాలతో సమాజంలోని వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టిన ఫోటో జర్నలిస్టులకు అభినందనలు.**

**జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించిన ఫోటో జర్నలిస్టులకు సన్మానం.**

**విశాఖకు సంబంధించిన అరుదైన, విశిష్ట ఛాయాచిత్రాలను మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ప్రదర్శించేందుకు సానుకూల స్పందన.**

**– జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**







**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగష్టు 19:**
ఛాయాచిత్రం ఒక సందర్భాన్ని మాత్రమే కాకుండా ఆ కాలంలోని చరిత్రను, సమాజాన్ని భావితరాలకు తెలియజేసే శక్తివంతమైన మాధ్యమమని, ప్రతి ఛాయాచిత్రం ఒక కథను చెబుతుందని, ఆ కథను భావితరాలకు చేరవేస్తుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల “న్యూస్ ఇన్ ఫ్రేమ్స్ ” వార్షిక ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను కమిషనర్ ముఖ్య అతిథిగా సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ సందర్భాలు, సంఘటనలను ప్రతిబింబిస్తూ ఫోటో జర్నలిస్టులు తీసిన ఛాయాచిత్రాలను కమిషనర్ ఆసక్తిగా తిలకించి, వాటి వెనుక ఉన్న సందర్భాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని విశిష్ట ఛాయాచిత్రాలను తన కెమెరాలో స్వయంగా బంధించారు. సమాజంలోని వాస్తవ పరిస్థితులు, భావోద్వేగాలు, ముఖ్యమైన సంఘటనలను ఒక్క ఛాయాచిత్రం ద్వారా ప్రజలకు ప్రభావవంతంగా తెలియజేయగలగడం ఫోటో జర్నలిస్టుల ప్రత్యేకత అని పేర్కొంటూ, ప్రదర్శనలోని చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని వారిని అభినందించారు. ఫోటోగ్రఫీ రంగంలో ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఫోటోగ్రఫీ పోటీల్లో జాతీయ అవార్డు పొందిన కె.ఆర్. దీపక్, కన్సోలేషన్ అవార్డులు పొందిన వై. రామకృష్ణ, పి.ఎల్. మోహన్ రావు, ఆలపాటి శరత్ కుమార్, పిల్లా నగేష్, కె. మురళీకృష్ణ, టి. గణేష్ కుమార్లను కమిషనర్ సత్కరించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఇటువంటి ప్రదర్శనలు ముఖ్యంగా విద్యార్థుల్లో ఫోటోగ్రఫీ, జర్నలిజం పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందిస్తాయని, నగర ప్రజలతో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ రెండు రోజుల ప్రదర్శనను సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు వై. రామకృష్ణ, విశాఖలో జరిగిన పలు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలతో పాటు నగర చరిత్ర, అభివృద్ధిని ప్రతిబింబించే ఫోటో జర్నలిస్టుల విశిష్ట ఛాయాచిత్రాలను సందర్భానుసారంగా విశాఖ మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి అందుకు అంగీకారం తెలిపారు.

# మాతృబాషలోనే విద్యాబోధన చేయాలి

**దేశం మొత్తాన్ని కలిపే బాష సంస్కృతం**

**తెలుగు, సంస్కృత భాషల వికాసానికి, అకాడమీ అభివృద్ధికి బహుముఖ ప్రణాళికలు**

**చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర)**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 19:**
తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన తర్వాత భాషా వికాసం మరియు అకాడమీ బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) తెలిపారు. బుధవారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని ఎ. యు. ప్రాంగణంలో గల తెలుగు అకాడమీ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని అకాడమీ ప్రాంతీయ కార్యాలయ భవనం అత్యంత శిథిలావస్థకు చేరి, కూలిపోయే స్థితిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితుల్లోనే ఇక్కడి నుంచి పుస్తకాల ముద్రణ, పంపిణీ సాగుతోందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నకు చెందిన ఆర్కిటెక్చర్ విభాగానికి చెందిన భవనాన్ని తాత్కాలికంగా కేటాయించాలని ఆంధ్రాయూనివర్శిటీ రిజిస్ట్రార్ ను కోరుడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే తిరుపతి, విశాఖపట్నంలలో శాశ్వత భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో, అమరావతి సి.ఆర్.డి.ఎ. ప్రాంతంలో 2 ఎకరాల భూమిని కేటాయించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, అకాడమీ వద్ద సొంత భవన నిర్మాణానికి 15 కోట్ల నుండి 20 కోట్ల రూపాయలు వరకు నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గిడుగురామమూర్తి జయంతిని పురస్కరించుకొని భాషా పరిశోధకులు, వ్యాకరణవేత్తలు, సాహితీవేత్తలను గౌరవిస్తూ విజయవాడలో గిడుగు రామ్మూర్తి పేరిట పురస్కారాలు అందజేస్తామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ నుంచి అకాడమీకి రావాల్సిన 60 కోట్లకు పైగా నిధులను తక్షణమే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసినట్లు అయన తెలిపారు. అదేవిధంగా అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను ఎ.పి.పి.ఎస్.సి. ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు.

**సంస్కృత సప్తాహం (ఆగష్టు 25 – 31)**
భాషా ప్రచారం కోసం ఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత యూనివర్సిటీ సహకారంతో 2026 ఆగష్టు 25 నుండి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా “సంస్కృత సప్తాహం” నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆగష్టు 25తేదిన శ్రీకాకుళం మరియు విజయనగరంలోను, ఆగష్టు 26 న విశాఖపట్నం మరియు కొవ్వూరు లలోను, ఆగష్టు 27 న తణుకు, గుంటూరు లలోను, ఆగష్టు 28న జిల్లెళ్లమూడి నందు, ఆగష్టు 30న కర్నూలు లోను, ఆగష్టు 31న గుడివాడ మరియు సమాపనోత్సవం విజయవాడ లలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. విశాఖపట్నంలో ఈ సదస్సు భారతీయ విద్యాకేంద్రంలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

# గుడిలోవ లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ మూడు రోజుల బైఠక్





**విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ ఆగష్టు 19**
విశాఖపట్నం సమీపంలోని గురులోవ ‘విజ్ఞాన్ విహార్’ పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారత సమన్వయ సమావేశం బుధవారం ఉదయం ప్రారంభమైంది. భారత్ మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడం ద్వారా సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ జీ , సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే జీ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశం ఆగష్టు 21వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ వార్షిక అఖిల భారత సమన్వయ సమావేశానికి పూజ్య డా. మోహన్ భగవత్ జీ, దత్తాత్రేయ హోసబలే జీ లతో పాటు సహ–సర్కార్యవాహకులందరూ ఇతర కేంద్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతారు. ఈ సమన్వయ సమావేశానికి ఆర్ఎస్ఎస్ ప్రేరణతో ప్రారంభమై పనిచేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ, అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్, భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికాసమితి లతో పాటు సంఘ్ స్ఫూర్తితో పనిచేస్తున్న మొత్తం 32 విభిన్న సంస్థల నుండి జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అఖిల భారత సంస్థాగత కార్యదర్శులు కొంతమంది ఎంపిక చేసిన కార్యకర్తలు హాజరయ్యారు. మొత్తం 49 మంది మహిళలతో కలిపి 327 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు.

# అచ్చెన్నాయుడు నోరు జాగ్రత్త

**బొత్సపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు -మంత్రి అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పాలి**

**శాసనమండలిలో సీనియర్ నేతపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం గర్హనీయం**

**డీఎస్సీపై చర్చకు భయపడి సీబీఐ విచారణకు వెనుకాడుతున్న కూటమి ప్రభుత్వం**

**వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, జివి రామచంద్రరావు డిమాండ్**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 19**
శాసనమండలిలో ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ‘దద్దమ్మ’ అంటూ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జీవీ రామచంద్రరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికార మదంతో చట్టసభల్లో స్థాయిని మరిచి వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికే అవమానకరమని, బొత్సకు అచ్చెన్నాయుడు తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం లో జీవీ రామచంద్రరావు ప్రెస్ నోట్ విడుదల చేశారు. డీఎస్సీ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి, కౌన్సిల్‌లో చర్చకు పారిపోవడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. డీఎస్సీలో అక్రమాలు జరగలేదనుకుంటే స్వతంత్ర లేదా సీబీఐ విచారణను ఎదుర్కోవడానికి భయమెందుకని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమ కేసులు, అరెస్టులతో వైఎస్సార్‌సీపీ గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకపోతే, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# స్థానిక యుద్ధానికి సిద్ధం కావాలి

**తాడేపల్లి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 19:**
స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని వైయస్ జగన్ తాడేపల్లి లో జరిగిన రాజమండ్రిరూరల్ నేతల సమావేశంలో పిలుపునిచ్చారు. మరో ఏడాదిలో నా పాదయాత్ర ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఏడాదిలో జరిగే ఎన్నికల్లో విజయం మనదే. వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఒక హామీ నిలబెట్టుకోలేదు, ప్రభుత్వంపై తీవ్ర.వ్యతిరేకత ఉంది ఎన్నికల్లో అది కనపడకూడదని పోలీసులను ప్రయోగిస్తారు. వాటిని ఎదుర్కొని యుద్ధం చేయాలని పేర్కొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి

## ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా





**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 19:**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి మల్లిఖార్జున ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, జెడ్పీ సీఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వార్డుల వారీగా వివరాలు, రిజర్వేషన్లు, ఓటర్ల సంఖ్య తదితర అంశాలను సరి చూసుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అవసరమైన డేటాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, మౌలిక వసతులు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాలను సేకరించి, అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు చేపట్టాలని, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నిబంధనలు, విధివిధానాలు, బాధ్యతలపై దశలవారీగా పూర్తి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్ లభ్యతను ముందుగానే నిర్ధారించుకోవడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రీ-ఎలక్షన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్, ప్రచురణలు, ఓటర్ల విభజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రధానంగా మూడు దశల ఎన్నికల సరళిపై చర్చించారు. అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన 15వ రోజున పోలింగ్ నిర్వహించి, పోలింగ్ ముగిసిన 18వ రోజున ఫలితాలు ప్రకటించేలా ప్రణాళిక ఉంటుందని వివరించారు. మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఓటర్లకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉన్నందున దీనిపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన 16వ రోజున పోలింగ్ నిర్వహించి, 19వ రోజున ఫలితాలు ప్రకటించే విధంగా షెడ్యూల్ ఉంటుందని చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన 14వ రోజున పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, సామగ్రిని సిద్ధం చేయడం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ వివరించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీపీవో శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ రమణ మూర్తి, ఎస్.డి.సి. గోవిందు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

## బాధితునికి నిత్యవసర వస్తువులు పంపిణీ



**మామిడిపదులు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**

రాజోలు నియోజకవర్గం, మామిడికుదురు మండలం,మగటపల్లి గ్రామం డయాబెటిస్ వ్యాధితో ఒక కాలు తొలగించబడ్డ కటకంశెట్టి వెంకటేశ్వరరావు కష్టాలు మానవతామూర్తులు బోనం రాజు ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్, బోనం వరలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఆవిడ జ్ఞాపకార్థం కుమార్తె సుచరిత సోదరుడు కోటిపల్లి రాజు సహకారంతో 2 వేల రూపాయలు విలువైన నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరిగింది.దీనికి బాధిత కుటుంబం దాతలకు ధన్యవాదాలు తెలిపాడు.

## మెరిట్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహం



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**

ప్రభుత్వ హైస్కూల్ లో చదివి పదవ తరగతి పరీక్షల్లో 500 పైబడి మార్కులు సాధించిన గీత కులాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు అనగాని సత్యప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేల రూపాయలు నగదును ప్రోత్సాహక బహుమతి గా అందించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు గీత కులాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించాలన్న ఉద్దేశంతో అనగాని సత్యప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాష్ట్రస్థాయిలో 125 మంది మెరిట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి 20 వేల రూపాయలు చొప్పున 25 లక్షల రూపాయలు నగదును అందించారు.కొత్తపేట కు చెందిన దొంగ శ్రీనివాసరావు కుమార్తె దొంగ పూజిత, గుబ్బల రామకృష్ణ కుమార్తె గుబ్బల దుర్గా ప్రియాంక ఇద్దరు విద్యార్థులకు 500 మార్కులు పైబడి రావటంతో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కురుపుడి సత్తిబాబుకు కొత్తపేటకు చెందిన గుబ్బల మూర్తి తెలియజేయగా సత్తిబాబు సిఫార్సు తో అనగానే సత్య ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి రూ. 20వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు.విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం నందు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజవరపు అచ్చంనాయుడు చేతుల మీదుగా నగదను అందించారు.విద్యార్థుల విద్యాభ్యాసం కోసం ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ..చైర్మన్ కుడుపూడి సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.మెరిట్ విద్యార్థులకు దాతల సహకారంతో నగదును అందించి ప్రతిభను ప్రోత్సహిస్తున్నవంటి మంచి కార్యక్రమాలు స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.చదువులలో ప్రతిభ కనబరిచిన కొత్తపేట విద్యార్థులు పూజిత, దుర్గా ప్రియాంకలను గుబ్బల మూర్తి దంగేటి చంటి గుబ్బల వెంకటరమణ మట్ట బాలు గుబ్బల సుబ్రహ్మణ్యం అభినందించారు. శాలువ కప్పి సత్కరించారు.

## చీఫ్ సెక్రటరీని మర్యాదపూర్వకంగా కలిసిన పి గన్నవరం ఎమ్మెల్యే

**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**

వెలగపూడిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



## కాకినాడ పోర్టు జాతీయ రహదారి 216తో అనుసంధానం..

### నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి కసరత్తు..



**కాకినాడ సిటిజన్ టైమ్స్,ఆగస్టు 19**

కాకినాడ పోర్టు దక్షిణ ద్వారం నుంచి ఉప్పలంక వద్ద ఉన్న జాతీయరహదారి వరకుసుమారు5కిలోమీటర్ల మేర ఈ కొత్త రహదారి ని నిర్మించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ పోర్టు దక్షిణ ప్రాంతం నుండి జాతీయ రహదారి సంఖ్య 216 వరకు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించేందుకు బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన.. భాగస్వామ్య శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారుల సంస్థ అధికారి బి. కృష్ణమూర్తి..ఈకాకినాడ పోర్టు దక్షిణ ప్రాంతం నుండి జాతీయ రహదారి 216 వరకు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించే ప్రాజెక్టు కు సంబంధించి గత జూలై నెల లో ప్రజాప్రతినిధుల తో నిర్వహించిన మొదటి సమావేశంలో సూచించిన సూచనలు,ఇందుకు అను గుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాల సమగ్ర నివేదికపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. కాకినాడ పోర్టు దక్షిణ ద్వారం నుంచి ఉప్పలంక వద్ద ఉన్న జాతీయ రహదారి వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఈ కొత్త రహదారిని నిర్మించడంజరుగుతుందన్నారు.ప్రస్తుతం పోర్టు నుండి వచ్చే సరుకు రవాణా వాహనాలు కాకినాడ నగరం గుండా సుమారు 27 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని,దీనివల్ల సమయం,రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న ఈ ఐదు కిలోమీటర్ల రహదారి వల్ల రవాణా దూరం 22 కిలోమీటర్లు తగ్గడమే కాకుండా,ప్రయాణ సమయం 30 నుండి 40 నిమిషాల వరకు ఆదా అవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో,రహదారి భద్రత మెరుగుపడటం,ఇంధన ఆదా,పర్యావరణకాలుష్యం తగ్గడం,స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ రహదారి మార్గనిర్ణయం, భూసేకరణ వంటి అంశాల లో పర్యావరణ,చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పోర్టు, రైల్వే, అటవీ, మత్స్యశాఖ అధికారులు సూచించిన సూచనలను.. ఎన్.హెచ్.ఏఐ అధికారులు సిద్ధం చేసిన అలైన్మెంట్ తో మరోక దఫా సరిచూసు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. సంబంధితశాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పే నాయక్ ఇతర భాగస్వామ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి నియోజకవర్గ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల 5,27,731 రూపాయలు అందజేత





**విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ (ఆగస్టు 19, 2026)**

తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భీమిలి నియోజకవర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ మత్తుకుమిల్లి శ్రీ భరత్ గారి చేతులు మీదుగా భీమిలి రూరల్ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ణూచీ రాజు గారు నేతృత్వంలో ఈ సహాయాన్ని అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీవ్ర అనారోగ్య సమయాల్లో వైద్య ఖర్చులు పెద్ద భారంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. మంజూరైన వారిలో కాళ్ల సురేష్ (భీమిలి రూరల్ మండలం, లక్ష్మీపురం గ్రామపంచాయతీ): ?38,550/-

**గ్రంధి నివాస్ (భీమిలి): 1,33,545/-**

వీటితో పాటు నియోజకవర్గానికి చెందిన మరో 8 మంది లబ్ధిదారులకు కూడా జవీ=ఖీ ఆర్థిక సాయం అందజేయబడింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ: ”పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఊహించని అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు వైద్య ఖర్చులు అత్యంత భారంగా మారుతున్నాయి. అలాంటి కష్టకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) ఆపద్బాంధవుడిలా నిలిచి, ఆయా కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వ సహాయాన్ని అర్హులైన ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి సకాలంలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తాం.” ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్నందుకు లబ్ధిదారులు మరియు స్థానిక నాయకులు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి గౌరవ రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి గౌరవ విశాఖపట్నం ఎంపీ శ్రీ మత్తుకుమిల్లి శ్రీ భరత్ గారికి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:** ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు:

శ్రీ కనకల సూరిబాబు గారు (మండల ప్రధాన కార్యదర్శి) శ్రీ బోని వెంకటరమణ (ఠణూ సీనియర్ నాయకులు) శ్రీ కరుభుక్త వెంకటాది నారాయణ (ఠణూ సీనియర్ నాయకులు) శ్రీ కనకల గోవింద్ (ఠణూ సీనియర్ నాయకులు) శ్రీ కరుభుక్త గణేష్ శ్రీ బుత్తల శ్రీనివాసరావు శ్రీ కాళ్ల రమణ మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడలో ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులతో సమావేశమైన ఎంపీ హరీష్

### ఓడలరేవు సముద్ర తీరంలో గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని కోరిన ఎంపీ హరీష్...

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సముద్రంలో బోటుపై వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కూటమి ప్రభుత్వం ,అధికార యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. ఈ మేరకు గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని కాకినాడలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులను కలసి కోరారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను వీలైనంత త్వరగా గుర్తించేందుకు ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ ఇతర బృందాల ద్వారా గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, వీలైనంత త్వరగా గల్లంతైన మత్స్యకారులను గుర్తించి వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు



ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల రక్షణకు ముమ్మర చర్యలు

## నౌకాదళం, కోస్ట్‌గార్డ్‌తో సమన్వయం చేసుకుంటూ 300 నాటికల్ మైళ్ల పరిధిలో ముమ్మర గాలింపు..

## బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా




**అమలాపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 19:**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఓడలరేవును సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రక్షణ చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 3న 'ముత్యాలమ్మ' బోటులో వేటకు వెళ్లిన కొల్లాటి యేసుదాసు, కోపనాతి రామకృష్ణ, పాలేపు సంతోషరావు, కర్రి రాంబాబు, కొల్లాటి శ్రీనుబాబు, సంగడి తాతారావు, పోనాడి సతీష్‌లు నిర్ణీత గడువు దాటినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి ధైర్యం చెప్పారు. ఈ పర్యటనలో కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

**300 నాటికల్ మైళ్ల పరిధిలో విస్తృత శోధన**

గల్లంతైన వారి ఆచూకీ కోసం భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంత రక్షణ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు ముమ్మరం చేశారు. ఐదు కోస్ట్‌గార్డ్ నౌకలు, రెండు నేవీ నౌకలు, రెండు అత్యాధునిక నిఘా విమానాల ద్వారా దాదాపు 300 నాటికల్ మైళ్ల పరిధిలో విస్తృతంగా శోధిస్తున్నారు. బోటులో సుమారు 1,000 లీటర్ల డీజిల్, 20 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు ఉండటం, సముద్ర వాతావరణం అనుకూలంగా ఉండటంతో మత్స్యకారులు క్షేమంగా ఉంటారని అధికారులు భావిస్తున్నారు.

**పారాదీప్ వద్ద బోటు గుర్తింపు – ముగింపు చర్యలు**

తాజాగా ఒడిశాలోని పారాదీప్‌కు సమీపంలో 'ముత్యాలమ్మ' పేరుతో ఉన్న పసుపు రంగు బోటును గుర్తించినట్లు సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అది గల్లంతైన బోటేనా కాదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించారు. బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేవరకు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతాయని, తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# నంద్యాల ఆకస్మిక మృతికి ప్రగాఢ సంతాపం



**కాట్రేనికోన సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**
ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, చెయ్యేరు రామలింగేశ్వర ఆక్వా అసోసియేషన్ అధ్యక్షులు, నంద్యాల వెంకటేశ్వరరావు(56)బుధవారం ఉదయం మరణించారు.ఆయనకు భార్య, ఒక కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకు గుండెపోటు రావడంతో ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించారు. ఆయన గతంలో రెండుసార్లు పంచాయతీ వార్డు నెంబర్ గెలుపొందారు. ఆక్వా అసోసియేషన్ తరపున ఆక్వా చెరువులకు రూ.1.50 పైసలు సబ్సిడీ వచ్చే విధంగా ప్రభుత్వంతో పోరాడి తీసుకువచ్చారు. వెంకటేశ్వరరావు మృతి వార్త తెలిసి చెయ్యేరు గ్రామానికి చెందిన ఆక్వా సంఘం నాయకులు త్సవటపల్లి నాగభూషణం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఆగస్టు 19 న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం...


**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 19:**
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని సఖినేటిపల్లి మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సఖినేటిపల్లి సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ రంగానికి చెందిన అసోసియేషన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని, ఫోటోగ్రఫీ పితామహుడు, ఫోటోగ్రఫీ రంగానికి విశిష్ట సేవలు అందించిన లూయస్ జాఖస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాలతో ఘననివాళి అర్పించారు. సఖినేటిపల్లి మండలంలో ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు నల్లి శ్రీనివాస్, కుమార్, స్టెలిన్, శ్రీను, మీనన్, చిన్ని, ఏసు, రాము, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి

## పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్.



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు19**
మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు, లోపాలకు తావులేకుండా ముందస్తు సన్నాహక ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేయాలని సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ చంద్ర పునేఠా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ముందస్తు సన్నాహక ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల సంబంధిత ప్రచురణలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల గుర్తింపు, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ముందస్తు సన్నాహక చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 10,90,975 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లాలోని 19 మండలాల పరిధిలో 342 గ్రామ పంచాయతీలకు సంబంధించి 3,878 వార్డులను గుర్తించినట్లు తెలిపారు.వీటి పరిధిలో మొత్తం 3,968 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటర్ల జాబితా పేజీలను నిబంధనల మేరకు పరిశీలించి, అవసరమైన చోట అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రెండు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదిత ఓటర్ల జాబితా పేజీల అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితాల విభజన, ప్రచురణ తదితర ప్రక్రియలను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ వేగవంతం**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల గుర్తింపు, వర్గీకరణ, వర్తింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా సిద్ధం చేయాలని సూచించారు. రిజర్వేషన్ల ఖరారులో ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎన్నికల కమిషన్ నిబంధనలు, అమలులో ఉన్న చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రిజర్వేషన్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ**

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోలింగ్ విధానం, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటర్ల జాబితాల నిర్వహణ, ఎన్నికల సామగ్రి వినియోగం,విధులు--బాధ్యతలు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. శిక్షణ అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి తమకు అప్పగించిన బాధ్యతలపై ఎటువంటి సందేహాలు లేకుండా చూడాలని, అవసరమైన చోట ప్రాక్టికల్ శిక్షణ కూడా అందించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.

**ముందస్తు ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని ముందస్తు చర్యలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు,ఎన్నికల సామగ్రి, సిబ్బంది,శిక్షణ, రిజర్వేషన్లు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వి. సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారిని శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తం పంచాయతీ నిధుల దుర్వినియోగం

## ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 19**
ఎత్తం గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ చర్యలు తీసుకున్నారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. ఎత్తం పంచాయతీ కార్యదర్శి రమేష్, గతంలో అక్కడ పనిచేసి ప్రస్తుతం ఎర్రన్నబావి తాండలో విధులు నిర్వహిస్తున్న బి. నరసింహలపై సస్పెన్షన్ వేటు పడింది. అదే సమయంలో ఎత్తం గ్రామ సర్పంచ్ బి. లక్ష్మి, ఉపసర్పంచ్ బి. ధర్మరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన అభివృద్ధి నిధుల వినియోగంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. నిధుల వినియోగం, అభివృద్ధి పనులు, బిల్లులు, చెల్లింపుల రికార్డులను పరిశీలించిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి అని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు ఉంటాయని వెల్లడించారు.



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రికార్డులు, బిల్లులు, చెల్లింపుల వివరాలపై విచారణ కొనసాగుతోంది.

# సెంట్రల్ డెల్టా ఆధునికీకరణకు రూ.3, వేల కోట్లు

## అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

## అభ్యర్థినపై స్పందించిన సీఎం చంద్రబాబు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**
గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని సాగునీటి వ్యవస్థ పునరుద్ధరణ, కాలువల ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నిధులను కేటాయించనుంది. సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ పనుల కోసం రూ.3,000 కోట్లు కేటా యించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు చేసిన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు సి ఎం ఈ నిర్ణయం తీసుకున్నారు . కాలువలు, లాకుల మరమ్మతులు: దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రధాన కాలువలు, బ్రాంచ్ కెనాల్స్, శిథిలావస్థకు చేరిన లొల్ల లాకులు తదితర కీలక నీటి నియంత్రణ వ్యవస్థల సమగ్ర పునరుద్ధరణకు ఈ నిధులు కేటాయిస్తారని ఆనందరావు తెలిపారు.

**చివరి ఆయకట్టుకు సాగునీరు:**

డెల్టా చివరి భూములకు (టెయిల్ ఎండ్ ప్రాంతాలకు) సైతం సాగునీరు సజావుగా చేరేలా పూడికతీత, కాలువల లైనింగ్ పనులు చేపట్టాలనే తన ఆలోచన కార్యరూపం దాలుస్తుండటం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

**డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనలి:** వర్షాకాలం, వరదల సమయంలో ముంపు బారిన పడే లంక గ్రామాలు, లోతట్టు వ్యవసాయ భూములను కాపాడేందుకు డ్రైనేజీల ప్రవాహ సామర్థ్యం పెంపు.

ఉమ్మడి గోదావరి డెల్టాలో వరితో పాటు ఉద్యానవన పంటలు, ఆక్వా రంగానికి మేలైన నీటి నిర్వహణ సౌకర్యాలు ఈ ప్రాజెక్టు ద్వారా అందుతాయని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు.

కోనసీమ ప్రాంతంలో సాగునీటి ఎద్దడి, ముంపు సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ అత్యవసరమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రూ.3,000 కోట్ల భారీ నిధులను కేటాయించేందుకు సి ఎం సుముఖత వ్యక్తం చేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతలు ముఖ్యమంత్రి కి స్థానిక ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు .

# ఆలయ పునః నిర్మాణానికి విరాళాల వెల్లువ

## నిర్మాణానికి సహకరిస్తున్న దాతలు


## రాతి కట్టడం తో స్వామి వారి ఆలయం



**ఐ పోలవరం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**
మురమళ్ల నిత్య కళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ కు చెందిన దంతులూరి సత్య వరాహ వినయ్ వర్మ శ మౌనిక దంపతులు రూ .1 లక్ష 1,116/- అందజేశారు. కాకినాడ కు చెందిన వెలిచేటి సుబ్రహ్మణ్యం దంపతులు రూ. 1 లక్ష 11 వేల 116/-విరాళం ఆలయ చైర్మన్ కు అందజేశారు. ఈసందర్భం గా దాతలను ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, చిత్ర పటం, ప్రసాదం అందించి సత్కరించారు. శ్రీ స్వామి వారి ఆలయ పునః నిర్మాణం స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు వారి పర్యవేక్షణలో జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. గర్భాలయ, అంతరాలయ, నంది మండపం సంబంధించి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.రూ లక్ష లేదా ఆపై విరాళం అందించే దాత పేరు శిలాఫలకం పై వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ అభినందించారు.

# డేటా సెంటర్ పై దుష్ప్రచారం

**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 19:**
విశాఖ డేటా సెంటర్ పై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి లోకేష్ విమర్శించారు. గూగుల్ ప్రకటన తర్వాత ఐటీ సంస్థలన్నీ విశాఖ వైపు చూస్తున్నాయని తెలిపారు. డేటా సెంటర్లో వల్లే ఏఐ టెక్నాలజీ అందుతుందని దాన్ని వద్దంటే ఎలా అని ప్రశ్నించారు. పోలవరం నుండి డేటా సెంటర్ కోసం డెడికేటెడ్ పైప్ లైన్ ఉందని పేర్కొన్నారు. థర్మల్ పవర్ కు అంతకంటే ఎక్కువ నీరు కావాలని, దాని గురించి ఎందుకు మాట్లాడలేదని అసెంబ్లీలో నిలదీశారు.



# అంతర్వేది నృసింహుని స్వాతి నక్షత్ర పూజలు...






**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 19:**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వా మివారి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, 108 కలశాలలో స్వామి వారి 108 అష్టోత్తర నామాలతో ఆవాహనం చేసి కలశలకు పూజలు, ప్రధాన కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి ఆ 108 కలశలతో స్వామివారికి పంచా మృతాలతో అభిషేకం చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహా స్వామివారి సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# శ్రీ రెడ్డెమ్మ దేవస్థానం నందు రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతం



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 19(సిటిజన్ టైమ్స్):** అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానము నందు రేపు అనగా శు క్రవారం ఉదయం 9:30 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించబడును. మహిళల సౌభాగ్యం ఐశ్వర్యం కోసం నిర్వహి స్తున్న ఈ వరలక్ష్మీ వ్రతము నందు మహిళలందరూ పాల్గొని శ్రీ అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని ఆలయ చైర్మన్ లంకిపల్లి రాజన్న నాయుడు గారు,ఈఓ మంజుల తెలియజేశారు.

# శ్రీ సాయి సేవ ఆశ్రమంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం

## పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు 78వ జన్మదిన వేడుకలలో భాగంగా మొక్కలు పంపిణీ కార్యక్రమం

**సంతమాగులూరు, (సిటిజన్ టైమ్స్):ఆగస్టు 19:**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలోని శ్రీ సాయి సేవ ఆశ్రమం నందు బుధవారం పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు 78 వ జన్మదిన సాయి సేవ ఆశ్రమ అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షిరిడి సాయి సేవశ్రమం మక్కెనవారిపాలెంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు భక్తులచే అభిషేకాలు అలంకరణలు చేయించారు. అంతరం భక్తులకు మొక్కల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు సాక్షాత్ దైవ స్వరూపులని, శ్రీ సాయి సేవ ఆశ్రమాలు ఎన్నో కట్టించారని, మన తెలుగువారి ఆశ్రమం మొదటిగా షిరిడి లో కూడా అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో కట్టించడం జరిగిందని, పచ్చదనం పరిరక్షణ పర్యావరణానికి ఎంతో ముఖ్యమని, ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మొక్కలు మొక్కలు నాటాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కెన భక్తులు పాల్గొనడం జరిగింది.

# విశాఖ ఎయిర్‌పోర్టు కార్మికుల ఆక్రందన

### న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం

### అసెంబ్లీ సాక్షిగా కార్మికుల భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్

### విశాఖ విమానాశ్రయాన్ని డొమెస్టిక్‌గా కొనసాగించి, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ హెచ్చరిక






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 19:**

విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేయడం వల్ల వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని నిరసిస్తూ బుధవారం తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ ఆధ్వర్యంలో బాధితులు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసినందుకు తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయని మహిళా కార్మికులు బి.జ్యోతి, కే.చిన్నారి, పి.రాధ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేష్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని, స్థానిక ఎంపీ భరత్, ఎమ్మెల్యే గణబాబు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

**కాంట్రాక్టర్ బెదిరింపులు, కార్మికుల ఆకలి కేకలు**

అరుణ్ ఏవియేషన్ కాంట్రాక్టర్ లావణ్య తమను యూనిఫామ్స్ ఇవ్వాలని బెదిరిస్తోందని, నెల జీతాలపై ఆధారపడే తాము ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని, తమ ప్రాణాలకు ఏదైనా హాని జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.


**అసెంబ్లీ సాక్షిగా ప్రకటన చేయాలి: బి.వి.రామ్**

విశాఖ ఎయిర్‌పోర్టు కార్మికుల సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా స్పష్టమైన ప్రకటన చేయాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ డిమాండ్ చేశారు. భోగాపురం విమానాశ్రయం రావడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం ఉన్న విశాఖ ఎయిర్‌పోర్టును డొమెస్టిక్ సర్వీసుల కోసమైనా కొనసాగించి కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. బాధితులకు తగిన న్యాయం చేయకపోతే ప్రజాప్రతినిధులకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, బొల్లినేని వెంకటేశ్వరరావుతో పాటు భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# భక్తులకు మౌలిక వసతులకు ప్రణాళికలు రూపొందించాలి

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలపై జాయింట్ కలెక్టర్ సమీక్ష

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 19**



భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వివేకానంద సమావేశం మందిరంలో శ్రీవత్స ఫౌండర్ సీఈవో బమిడిపాటి కిరణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాడపల్లి ఆలయ అభివృద్ధికి సంబంధించి రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్‌ను సమగ్రంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొం దించాలని తెలిపారు. ఆలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, భవిష్యత్‌లో పెరిగే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు వివరాలు సమర్పించారు. మాస్టర్ ప్లాన్‌లో ఆలయ ప్రాంగణ అభివృద్ధి, భక్తుల రాకపోకలకు అనుగుణంగా రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు,విద్యుత్, పారిశు ధ్యం, క్యూలైన్ వ్యవస్థ, భక్తుల విశ్రాంతి ప్రాంతాలు, వాహనాల నియంత్రణ, పచ్చదనం, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రవేశం, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని, రద్దీ సమయాల్లో భక్తుల నియం త్రణకు అవసరమైన ఏర్పాట్లను మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నారులకు అనుకూలంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, పచ్చదనం తదితర అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, అవసరమైన మార్పులు, చేర్పులు చేసి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతిపాదనలను పరిశీలించి,సాధ్యా సాధ్యాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. వాడపల్లి ఆలయ అభివృద్ధి పనులు భక్తుల సౌకర్యాలతో పాటు ప్రాంతీయ పర్యాటక అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌ను నాణ్యత, భద్రత, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అమలాపురం ఆర్డీవో జి వి వి సత్యనారాయణ, దేవాదాయ శాఖ అధికారి వి సత్యనారాయణ,జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ అధికారి పార్థసారథి, ఆత్రేయపురం ఎమ్మార్వో టి.రాజేశ్వరరావు,ఇండస్ట్రీస్ జిఎం అరుణ జిఐఎస్ కోఆర్డినేటర్ లీర్తి, ఇంజినీరింగ్ విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి రద్దు నిరసిస్తూ బి ఆర్ ఎస్ మహా ధర్నా

### ఆగస్టు 20న గాంధీ పార్క్‌లో

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు19**

కళ్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ పథకాల రద్దు కుట్రలను నిరసిస్తూ బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 20న నాగర్‌కర్నూల్ గాంధీ పార్క్‌లో మహా ధర్నా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ధర్నా కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హాజరుకానున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని బి ఆర్ ఎస్ నేతలు పిలుపునిచ్చారు. టౌన్‌తో పాటు అన్ని మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామం నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని బి ఆర్ ఎస్ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం పథకాలను రద్దు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



# బీసీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఢిల్లీ /ఏలూరు,:(సిటిజన్ టైమ్స్):ఆగస్టు 19:**

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లకు కోతపెట్టి అన్యాయం చేసిందని, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై బీసీ కులాల తరపున ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యాధికారంలో బీసీలకు అవకాశాలు పెరుగుతాయని, ఎంతో మంది బీసీ కులాల యువకులకు నాయకులుగా ఎదిగే అవకాశం లభిస్తుందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. చట్ట సభల్లో కూడా బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో ఇప్పటికే తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని బీసీ కులాలన్నీ రుణపడి ఉంటాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

# హెచ్ఐవిపై అవగాహన

**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్):ఆగస్టు 19:**

గిద్దలూరు మండలం గిద్దలూరు లోని సెయింట్ పాల్ హై స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ ఐఈ సి క్యాంపెయిన్ భాగంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాక్షన్ లెడ్ దిశా ఈ సదస్సులో హెచ్ఐవి అనగానేమి అది ఎలా వ్యాప్తి చెందుతుంది హెచ్ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి హెచ్ఐవి ఎయిడ్స్ సంబంధించిన అపోహాలు లక్షణాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం అదేవిధంగా యువత డ్రగ్స్ కు బానిసలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని ఈ వ్యాధికి చికిత్స లేదు నివారణ ఒకటే మార్గం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో తెలియజేయడం సుఖ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం హెచ్ఐవి ఎయిడ్స్ ఆక్ట్ 2017 గురించి చెప్పడం ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ రమేష్ , పి తిరుపతయ్య ఈ రాజేశ్వరి , ఈ రవిచంద్ర హెచ్ ఓ సిబ్బంది వై దుర్గ భవాని, రిప్కా సునీత తదితరులు పాల్గొన్నారు.

